## క్లుప్తంగా

### పెనగలూరు ఎస్ఐగా సుబ్బారెడ్డి



పెనగలూరు : పెనగలూరు ఎస్ఐగా బి.సుబ్బారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న హేమాద్రి మదనపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న సుబ్బారెడ్డి పెనగలూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెనగలూరు మండలాన్ని శాంతియుత మార్గంలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. ప్రతిరోజూ రాత్రివేళల్లో సిబ్బందితో గస్తీ తిరిగి ఎలాంటి సంఘటనలు జరగకుండా చూస్తామని తెలిపారు. ప్రజలకు ఏ సమస్యలు ఉన్నా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియపరచాలన్నారు.

### ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ, పదోన్నతి పొందిన జెడ్పీ ఉపాధ్యాయులకు సన్మానం చేసిన పాఠశాల సిబ్బంది

నందలూరు(రాజంపేట) : మండలంలోని నల్ల తిమ్మాయపల్లె జెడ్పీ ఉపాధ్యాయులలో బదిలీ, పదోన్నతుల పొందిన వారిని గురువారం ఘనంగా సన్మానించారు. హెడ్‌మాస్టర్ రమణమ్మ అధ్యక్షతన జరిగిన సన్మానసభలో సన్మాన గ్రహీతులు అందించిన సేవలను కొనియాడారు. ఇందులో శ్రీనివాసులరావు, మల్లీశ్వరి, పుష్పలత, అల్ల అశోక్, సాముల నాయక్, చంద్రకుమార్, చౌడమ్మ, ప్రశాంతిలకు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు చెంగయ్య, ఉపాధ్యాయులు షఫివుల్లా, లక్ష్మీకాంతమ్మ, సిబవుతుల్లా, సరిత, భరత్‌కుమార్, చంద్రశేఖర్, రషీద్, వెంకటేశ్, నిత్యపూజయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓను సన్మానిస్తున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి తదితరులు

వీరబల్లె (రాయచోటి టౌన్) : ఉత్తమ ఎంపీడీఓగా ఎన్నికైన ఎంపీడీఓ మల్లీశ్వరిని వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డిలు ఘనంగా సన్మానించారు. గురువారం ఆయన చాంబర్‌లో ఆమెను కలిసి దుశ్శాలువా, మెమెంటోను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ అవార్డు అందుకోవడం నా బాధ్యతను మరింత పెంచిందన్నారు. ప్రజలకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ మరింత మెరుగైన సేవలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పెదివీడు సర్పంచ్ నాగిరెడ్డి, శ్రీరాములరెడ్డి, బీసీ నాయకులు నాగభూషణం, సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

### వార్డు అభివృద్ధికి కృషి



ఉప్పరపల్లె 10వ వార్డులో ప్రచారం చేస్తున్న అభ్యర్థి అన్నిక నీలిమ, వైఎస్ఆర్‌సీపీ నాయకులు

సిద్దవటం : ఉప్పరపల్లె గ్రామ పంచాయతీలోని 10వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని వార్డు మెంబర్ అభ్యర్థి అన్నిక నీలిమ అన్నారు. సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లె గ్రామ పంచాయతీ 10వ వార్డులో గురువారం ఆమె ముమ్మరంగా ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఆమె కరపత్రాన్ని అందజేసి ప్రెషర్ కుక్కర్ గుర్తుకు ఓట్లు వేసి, వేయించి గెలిపించాలని ఆమె కోరారు. ప్రచారంలో స్థానిక సర్పంచ్ మేరువ బాలాజీ, వైఎస్ఆర్‌సీపీ నాయకులు కనపర్తి సుబ్బారెడ్డి, మల్లికార్జున, హిదయతుల్లా, హసన్, సూరి, భరత్ పాల్గొన్నారు.

### ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె రెండవ వార్డుకు జరుగుతున్న ఉప ఎన్నికల బరిలో నిలిచిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి షేక్ మాబున్నీసా గౌను గుర్తుకు ఓటువేసి మెజార్టీతో గెలిపించాలని జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రెండో వార్డులో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభ్యర్థితోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎంపీటీసీ దస్తగిరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాజహాన్, ఉప సర్పంచ్ రాజారెడ్డిల ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మినారాయణ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు చాన్ బాషా, ఖాజా, గౌస్‌పీర్, ఇస్మాయిల్, జాకీర్, నాసీర్, బాబ్‌జాన్, వార్డు మెంబర్లు తోటం శెట్టి వరుణ్ కుమార్, సైమన్, రవి ఆచారి, అన్వర్, ఆరీఫ్, సాహెబ్, నబీ, తన్వీర్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

# పథకాలకు ప్రతి గడపలో స్పందన

- అసత్యాల ప్రచారంలో పచ్చమీడియా నిమగ్నం
- సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరిస్తూ..
- గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



సంక్షేమ బావుటాను అందజేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

పెనగలూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రతి గడపలో విశేష స్పందన లభిస్తోందని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం కుడప అరుంధతివాడ, ఓబిలి, అత్తిగారిపల్లి, జడావారిపల్లి, ఓదేటివారిపల్లె గ్రామాలలో మండల వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని అధికారులతో అప్పటికప్పుడే పరిష్కరించే దిశగా చర్చించారు. ఓబిలి సచివాలయ పరిధిలో జగన్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రూ. 11.87 కోట్లను ప్రజలకు సంక్షేమ పథకాలు ద్వారా అందించామన్నారు. ప్రభుత్వ పథకాల రూపంలో 1600 మందికి పైగా లబ్ధి పొందారని ఆయన అన్నారు. ప్రభుత్వం నేరుగా వారి ఖాతాలలో వేస్తుంటే పచ్చపత్రికలు పనిగట్టుకొని ప్రభుత్వంపై బురదజల్లుతున్నాయని ఆరోపించారు. గతంలో ఎప్పుడైనా ఒక సచివాలయ పరిధిలో ఇన్ని కోట్ల రూపాయలు నేరుగా ప్రజల ఖాతాలలో ఏ ప్రభుత్వమైనా వేసిందా అని ప్రశ్నించారు. ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకే జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ముఖ్యంగా పచ్చమీడియా పనిగట్టుకొని అసత్యాలను ప్రజలకు చూపిస్తోందని ఎద్దేవా చేశారు. అంతకుముందు కుడప అరుంధతివాడలో చిన్న పిల్లలకు అంగన్‌వాడీ సెంటర్ లేక బెస్తపల్లె, ఓబిల గ్రామాలకు దాదాపు 2 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని, తమ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మహిళలు ఎమ్మెల్యేను కోరగా వెంటనే ఐసీడీఎస్ అధికారులతో చర్చించి మినీ అంగన్‌వాడీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, దీనిపై తమకు పూర్తి నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అలాగే అత్తిగారిపల్లి, ఓదేటివారిపల్లి దళితవాడలకు తాగునీరు రావడం లేదని ప్రజలు తెలియజేయడంతో వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను పిలిపించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటికి అవసరమైతే కలెక్టర్‌తో చర్చించి ఇబ్బందులు లేకుండా చేస్తామని ఆయన హామీనిచ్చారు. మండల వైస్ ప్రెసిడెంట్ విజయ్‌రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో అత్యవసరమైన పనులను చేపట్టి ప్రజల సమస్యలు తీర్చేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఎమ్మెల్యే సహకారంతో ఓబిల పంచాయతీలో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర డైరెక్టర్ ఈశ్వరయ్య, మండల కో–ఆప్షన్ మెంబర్ లాడెన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, ఓబిలి ఎంపీటీసీ బాషా, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కేతా చక్రపాణి, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ చాంద్ బాషా, ఎంపీటీసీ సాహెబ్ బాషా, మాజీ సర్పంచ్ హబీబ్, పులి నారాయణ, నాగభూషణం, తహసీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, దుర్గయ్య, శ్రీనివాసులు, సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను రైతులకు చేరవేయండి



ఆర్‌బీకే అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న ప్రసాద్‌రెడ్డి

రాజంపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలను వారికి చేరవేయడంలో చొరవ చూపాలని ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆర్‌బీకే అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో గురువారం డివిజన్ స్థాయి ఆర్‌బీకేల అధికారులతో సమీక్షా సమావేశాన్ని వ్యవసాయశాఖ ఏడీ ఏ.సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సంబటూరు ఆర్‌బీకే అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుగా ఆరా తీశారు. అదే విధంగా రైతులకు ఏ స్థాయిలో అందుబాటులో ఉంటున్నారో అడిగి తెలుసుకున్నారు. డ్రిప్ పరికరాలను అర్హత ఉన్న ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట నమోదులో పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నమోదు చేయాలని ఆదేశించారు. రైతులకు వ్యక్తిగతంగా ఉపయోగపడే వ్యవసాయ పనిముట్ల వివరాలను ప్రణాళికంగా తయారు చేసి పంపాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి హెచ్.సురేష్‌బాబు, రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల ఆర్‌బీకే అధికారులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతుల విద్యార్థులకు ఉపకార వేతనాలు



విద్యార్థులకు ప్రోత్సాహక ఉపకార వేతనాలు అందజేస్తున్న దృశ్యం

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి చదువుతున్న ప్రతిభావంతుల విద్యార్థులకు బయోస్టాడ్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం ప్రోత్సాహక ఉపకార వేతనాలను అందజేసింది. ఈ సందర్భంగా బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీకి వచ్చిన లాభాల్లో కొంతభాగాన్ని తమ పేద రైతు కుటుంబాల అభివృద్ధికి వినియోగించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా పాఠశాలకు పది మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ. 2500 ప్రోత్సాహక ఉపకార వేతనాలు అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలే కాకుండా ప్రైవేట్ యాజమాన్యాలు కూడా ఉత్తమ ప్రతిభావంతులను ఎంపిక చేసి పేద గ్రామీణ విద్యార్థులకు ప్రోత్సాహక ఉపకార వేతనాలు అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కంపెనీ ఎండీఓ రవేష్, డిస్ట్రిబ్యూటర్ నరసింహ, మానవత సంస్థ చైర్మన్ జయచంద్రారెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 1962 వాహన సేవలను సద్వినియోగం చేసుకోండి



1962 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

రాయచోటి టౌన్ : 1962 వాహన సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి అన్నారు. గురువారం వీరబల్లె మండలంలోని పశు వైద్యశాలలో 1962 డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాన్ని ఎంపీడీఓ మల్లీశ్వరితో కలసి ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న పాడి పరిశ్రమ, పాడి రైతులు మరింత అభివృద్ధి చెందేందుకు అహర్నిశలా కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఈ వాహనాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. మనకు ఏదైనా అనారోగ్యం అయితే 108కు ఎలా అయితే ఫోన్ చేస్తే 108 వాహనం వచ్చి మనల్ని ఆస్పత్రికి తీసుకెళుతుందో అదే విధంగా 1962 వాహనం కూడా మన ఇంటికి వస్తుందని చెప్పారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాప్తి ఉన్నందువలన ఈ వాహనాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంబులెన్స్ డాక్టర్ అలతి రెడ్డి, సిబ్బంది సమీర, కిరణ్, పెదివీడు సర్పంచ్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరాముల రెడ్డి, సుబ్బరామ రాజు, వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి



క్రైం మీటింగ్‌లో మాట్లాడుతున్న జడ్జి కె.లత

రాజంపేట : వచ్చే నెల 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని నందలూరు జడ్జి కె.లత పిలుపునిచ్చారు. బుధవారం రాజంపేట, నందలూరు కోర్టు పరిధిలో ఉన్న పోలీసు అధికారులతో నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో క్రైం మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించాల్సి ఉందన్నారు. ఆ దిశగా అన్ని స్టేషన్ల పరిధిల్లోని కేసులను గుర్తించాలన్నారు. ప్రతి రోజు లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమంలో రాజంపేట అర్బన్ సీఐ నరసింహారావు, ఎస్ఐలు రఘురాం, భక్తవత్సలం, సుభాష్‌చంద్రబోస్, నందలూరు ఏఎస్ఐ శంకర్‌నాయక్ , కోర్టు కానిస్టేబుల్స్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేలతల్లిని గౌరవించుకుందాం



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆర్‌డీఓ రంగాస్వామి

రాయచోటి టౌన్ : జన్మనిచ్చిన తల్లితో సమానంగా నేల తల్లిని గౌరవించుకుందామని రాయచోటి ఆర్‌డీఓ రంగాస్వామి అన్నారు. గురువారం శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఎస్ఎస్ఐటీఎస్ యువ టూరిజం క్లబ్ వారి ఆధ్వర్యంలో నా మట్టి – నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంతో స్వతంత్ర్య భరతావని ఏర్పడిందన్నారు. ఆ త్యాగమూర్తులను గ్రామ స్థాయి నుంచి స్మరించుకొని వారి ఆశయ సాధనకు అందరం కలసికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి, జిల్లా టూరిజం అధికారి నాగభూషణ్, రాయచోటి మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ప్రభుత్వ పాలిటెక్నికల్ ప్రిన్సిపల్ శివశంకర్, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఆఫీసర్ నాగరాజు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాలాజీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### తులసీదాస్ జయంతి వేడుకలు

రామాపురం : తులసీదాస్ జయంతి వేడుకలను మండల కేంద్రలోని హరిహర దేవాలయంలో గురువారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తులసీదాసు రచించిన రామ చరిత మానస్, హనుమాన్ చాలీసా రచించినట్టు వక్తలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా భజరంగదళ్ సురక్షా ప్రముఖ్ వీరారెడ్డి, లక్కిరెడ్డిపల్లె ప్రఖండ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, ఉపాధ్యక్షులు చిన్నరెడ్డి, సహకార్యదర్శి దామోదర్‌నాయుడు, మూర్తి, స్వామినాథన్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

### రేపు రెడ్డి అన్నప్రసాద నిలయం ప్రారంభోత్సవం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయానికి భారీగా వస్తున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని శ్రీ కోదండ రామస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో రేపు(శనివారం) రెడ్డి అన్నప్రసాద నిలయాన్ని ప్రారంభిస్తున్నట్లు గురువారం సేవా సమితి సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని నడింపల్లి గ్రామ సమీపంలో కడప – చెన్నై జాతీయ రహదారికి పక్కనే ఈ అన్నప్రసాద నిలయాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవానికి రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి, కడప జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. కార్యక్రమానికి మండల ప్రజలు, భక్తులు, దాతలు హాజరై విజయవంతం చేయాలని సేవా సమితి సభ్యులు కోరారు.

### దివ్యాంగులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

రాయచోటి టౌన్ : పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో దివ్యాంగుల పరికరాల కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో దివ్యాంగులకు కనీస వసతులు కల్పించకపోవడం బాధాకరమని రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి ఆరోపించారు. గురువారం బాలికోన్నత పాఠశాలలో దివ్యాంగులకు వివిధ పరికరాలు అందించేందుకు దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాయచోటి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన దివ్యాంగులు వచ్చారు. వారికి కనీస తాగునీరు, భోజనం వంటి మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు.

### చేయూత అందించడమే మానవత లక్ష్యం

లక్కిరెడ్డిపల్లె : మానవత్వాన్ని చాటుకొని తోటి మానవులకు చేయూతను అందించేదే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అని చైర్మన్ బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. మానవత వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక నలందా హైస్కూల్ నుంచి మూడు రోడ్ల కూడలి వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, తహసీల్దార్ ఉదయ్ శంకర్ రాజు, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, సామాల నరసింహారెడ్డి, సహదేవరెడ్డి, రామ్మోహన్ రెడ్డిలు శాంతి ర్యాలీలో పాల్గొని మానవత సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మానవత సభ్యులు సుబ్బారెడ్డి, రమణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ విజయ్ భాస్కర్, శివయ్య, గోపాల్, రాజారెడ్డి, రమణ, రామాంజనేయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు పరికరాల పంపిణీకి దరఖాస్తుల ఆహ్వానం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో రేపు (శనివారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కృత్రిమ అవయవాలు, దివ్యాంగులకు పరికరాలు అందజేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్టు ఎంపీడీఓ జాషువా గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులు చేసుకొనే వారు సదరన్ సర్టిఫికెట్, ఆధార్ తదితర గుర్తింపు కార్డులను తమ వెంట తీసుకురావాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి పరికరాలు, అవయవాలు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క దివ్యాంగులు వినియోగించుకోవాలని కోరారు.

## సీఎం సహాయనిధి లబ్ధిదారులకు పెన్నిధి



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

రాజంపేట రూరల్ : సీఎం సహాయనిధి వ్యాధుల బారిన పడి చికిత్స చేయించుకొని ఆర్థికంగా నష్టపోయినటువంటి వారికి లబ్ధి చేకూర్చే పెన్నిధిలా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అన్నారు. స్థానిక మేడా భవన్‌లో గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే మేడా పంపిణీ చేశారు. లబ్ధిదారులైన చుక్కా ఎల్లయ్యకు రూ. లక్ష, టి.రాజమ్మకు రూ. 60వేలు, ఎస్. పెంచలయ్యకు రూ.55వేలు విలువచేసే చెక్కులను మేడా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ వెలగచెర్ల గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు విశ్వనాథరాజు, దొరబాబు, భీమురాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌ను కలిసిన పోలా



సీఎంను కలిసిన చైర్మన్ పోలా, ఆయన తనయుడు సాయివైభవ్‌రెడ్డి

రాజంపేట : రాజంపేట మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ విషయాన్ని పోలా గురువారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. రాజంపేట అభివృద్ధిపై సీఎం జగన్‌తో చర్చించామన్నారు. మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధికి నిధుల కేటాయింపు విషయంలో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఈ తరుణంలోనే రాజంపేటకు రావాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. వీలు చూసుకొని వస్తానని సీఎం తెలియజేశారన్నారు. పోలా వెంట ఎంప్రాడ్ మినరల్స్ అధినేత ఆకేపాటి విక్రమ్‌రెడ్డి, పోలా తనయుడు పోలా సాయివైభవ్ రెడ్డి పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

రాయచోటి టౌన్ : మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి కార్యాలయం నుంచి ర్యాలీగా ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ సర్కిల్ వద్దకు చేరుకొని మానవహారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని ఆయన ఇచ్చిన హామీ మేరకు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500లు చెల్లించాలని కోరారు. అలాగే సుప్రీం కోర్టు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం కింద కార్మికులకు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైవి రమణ చెన్నయ్య, తిరుపాల్, లక్ష్మిదేవి, రవి, మధు, సిద్దమల్లు, సురేంద్ర, జీవీరమణ, తిరుపతమ్మ, మంగమ్మ, మాధవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలను పరిష్కరించండి



రైతుల సమస్యలపై తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సాయికిషోర్

ఓబులవారిపల్లె : మండలంలోని నెలకొన్న రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతుల సమస్యలపై సాయికిషోర్ రెడ్డి తహసీల్దార్ పుల్లారెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌కు సంబంధించి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఆన్‌లైన్ తప్పనిసరి కావాడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో రికార్డులు పరిశీలించి, సర్వే చేసి రైతుల ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ పుల్లారెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీసీయూ మెంబర్ భరత్‌కుమార్ రెడ్డి, ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## తూనికల నిబంధనలు పాటించాలి

గాలివీడు : తూనికలు, కొలతల శాఖ నిబంధనలు దుకాణాల యజమానులు తప్పకుండా పాటించాలని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కిరాణా దుకాణాలు, ఫర్టిలైజర్ షాపుల్లో పలు దుకాణాల్లో తూనికల తేడాలను తనిఖీలు చేశారు. బస్టాండు సమీపంలో నిబంధనలు పాటించని ఓ సూపర్ మార్కెట్‌పై రూ. 7వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. అధికారుల దాడులు మండల కేంద్రంలో చేపట్టడంతో మిగతా దుకాణాల యజమానులు షాపు షెటర్లకు తాళాలు వేసి జారుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో తయారైన ప్యాకెట్లపై తయారీదారుని (కంపెనీ) పేరు, తేదీ, బరువు, నిర్ణయించిన ధర తప్పనిసరిగా నమోదై ఉండాలన్నారు. అలా లేకుండా ప్యాకింగ్‌లు చేసి అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు దుకాణాలకు తాళాలు వేసుకొని వెళ్లిన వారిని వదిలే ప్రసక్తే లేదని, ఇకపై తనిఖీలు కొనసాగుతాయని హెచ్చరించారు.

## నగదు రహిత చెల్లింపులు ప్రారంభం



నగదు రహిత స్కానర్‌లను ప్రారంభిస్తున్న చెన్నముక్కపల్లె సర్పంచ్, అధికారులు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామ సచివాలయంలో నగదు రహిత చెల్లింపు కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ సర్పంచ్ రాయవరం మమత ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏపీఐఐసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసుల రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగదు రహిత పథకాన్ని గ్రామస్థాయిలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇలా చేయడం వలన పారదర్శకత పెరిగి అవినీతి తగ్గి పంచాయతీ ఆదాయం పెరుగుతుందని చెప్పారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి నగదు రహిత గ్రామ పంచాయతీగా చెన్నముక్కపల్లె కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెడీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ అశోక్ రెడ్డి, అకౌంట్ హెడ్ రామాంజనేయుల రెడ్డి, సెక్రటరీలు రామరాజు, రామచంద్ర, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అభ్యున్నతే ఏపీయూడబ్ల్యూజే ధ్యేయం



పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రశాంతి

రాజంపేట రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల అభ్యున్నతే ధ్యేయంగా ఏపీయూడబ్ల్యూజే పని చేస్తుందని రాజంపేట ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు తెలియజేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో బాలింతలు, గర్భిణులు, వ్యాధిగ్రస్తులకు యూనియన్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గురువారం పండ్లు, బ్రెడ్లను యూనియన్ ప్రతినిధులు డాక్టర్ జి.ప్రశాంతి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం నిత్యం పోరాటాలు చేస్తున్న యూనియన్ ఏపీయూడబ్ల్యూజే అని కొనియాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారినికి ఏపీయూడబ్ల్యూజే ఎనలేని కృషి చేస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు కె.అనీల్‌కుమార్, టి.రవిచంద్రప్రసాద్, ఎం.శ్రీధర్, బి.భాస్కర్, కె.రఘురామరాజు, జె.నాగేంద్ర, మందా శివయ్య, ఎం.నరేష్, వై.ప్రసాద్, కె.సుధాకర్, ఎస్.అలీషేర్, పి.దుర్గయ్య, సి.వెంకటసుబ్బయ్య, టీబీ సూపర్‌వైజర్ పిల్లి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ మాత్ర తప్పనిసరి

రామాపురం : ప్రతి ఒక్కరూ నులిపురుగుల నివారణ మాత్రను తప్పక వేసుకోవాలని మండల వైద్యులు విజయ్‌కుమార్, వినోద్‌కుమార్‌లు అన్నారు. గురువారం మాపాప్‌లో భాగంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగు దినోత్సవం సందర్భంగా 1–19 వయస్సు ఉన్న వారికి 95 శాతం నులిపురుగుల మందులను పంపిణీ చేశామన్నారు. మిగిలిన 5 శాతం మంది పిల్లలకు మాపాప్‌లో భాగంగా నులిపురుగుల మందులను పంపిణీ చేశారు. సంవత్సరంలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని, గ్రామ పంచాయతీ పరిధిలోని సచివాలయాలలో వేయనున్నట్టు తెలియజేశారు. వ్యాధి నిరోధక టీకాలు వేయడం వలన వచ్చే ఉపయోగాలను పిల్లల తల్లిదండ్రులకు, గ్రామస్తులకు వివరించాలని సిబ్బందికి సూచించారు.